
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 8 ఫిబ్రవరి 2024



## రేపటి నుంచి భగీరథపీఠం రజత మహోత్సవం

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** చిత్రదుర్గ జిల్లాలోని హొసదుర్గ బ్రహ్మ విద్యానగర భగీరథ గురుపీఠం రజత మహోత్సవాలు ఈ నెల 9న ప్రారంభమై రెండు రోజుల పాటు జరగనున్నాయి. ఇదే సందర్భంగా పురుషోత్తమానంద స్వామిజీ పట్టాభిషేక మహోత్సవం, జాతీయ భగీరథ జయంత్యుత్సవం, ఉప్పార సమావేశం ఏర్పాటవుతున్నాయని గురుపీఠం నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కాగా సాలుమరద తిమ్మక్కతో పాటు పలువురు ప్రముఖులకు భగీరథ రత్న పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

# కేంద్రం కళ్లు తెరిచేదాకా పోరాటం



ధర్నాలో ప్రసంగిస్తున్న సీఎం

### కరువు నెలకొన్నా కనికరమేదీ..?

### నోరుమెదపని రాష్ట్ర ఎంపీలు

### హస్తిన ధర్నాలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

### పోటీగా బెంగళూరులో బీజేపీ ధర్నా

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ కేంద్రప్రభుత్వం బీజేపీ యేతర పాలిత రాష్ట్రాలపై చేస్తున్న ఆర్థిక దౌర్జన్యాలను ఇకపై సహించే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గర్జించారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం ప్రదర్శిస్తున్న పక్షపాతం కారణంగా 2017 నుంచి ఇంతవరకు రాష్ట్రానికి రూ.1,87,867 కోట్ల మేరకు నష్టం జరిగిందన్నారు. ఈ నష్టాన్ని పూడ్చకుండా కేంద్రం రాజకీయ గిమ్మిక్కులు చేస్తోందని మండిపడ్డారు. ఇంతభారీ మొత్తం రాష్ట్రానికి అంది ఉంటే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమయ్యేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన గ్యారెంటీ పథకాలతో కేంద్ర పాలకుల్లో వణుకు ప్రారంభమై వాటినే కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీభత్సమైన కరువు పరిస్థితి నెలకొన్నా కేంద్రం ఏమాత్రం కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నడిగుల ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని తెలిపారు. బీజేపీ హయాంలోనూ కర్ణాటకకు తీరని అన్యాయం జరిగినా ఎంపీలు నోరు మెదపలేదన్నారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్ర వాటా 4.71 శాతం నుంచి 3.64 శాతానికి తగ్గడం అన్యాయం కాదా..? అని ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘంలో రాష్ట్రానికి దక్కాల్సిన కేటాయింపులు 3.64 శాతానికి తగ్గాయన్నారు. గత ఐదేళ్లలో ఈ నష్టం రూ.62వేల కోట్లపైనే ఉందన్నారు. జీఎస్టీ వాటా విషయంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు మూడు లేఖలు రాశానని ఒక్కదానికీ బదులు లేదన్నారు. రాష్ట్రం ప్రతి ఏటా రమారమి రూ.4.5 లక్షల కోట్లు కేంద్రానికి ఇస్తుంటే రూ.50వేల కోట్లు మాత్రమే వాపసు ఇస్తున్నారన్నారు. జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తున్నందుకే బీజేపీ నేతలు దిక్కుతోచక నోటికొచ్చిన వ్యాఖ్యలు చేస్తున్నారని సీఎం విరుచుకుపడ్డారు. సెస్, సర్ చార్జీల విషయంలో కూడా రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. గత బడ్జెట్‌లో అప్పర్ భద్రకు ప్రకటించిన రూ.5,300 కోట్లలో ఇంతవరకు ఒక్క పైసా విడుదల కాలేదన్నారు. బీజేపీ నేతలు అంకెల గారడీతో ఎంతకాలం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తారని ఆయన నిలదీశారు. బీజేపీ మోసాల కారణంగానే శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయినా గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. రాష్ట్రంలోని 223 తాలూకాల్లో కరువు పరిస్థితి నెలకొందని, రూ.17,901 కోట్లు పరిహారం ఇవ్వాలని దిక్కులు పిక్కటిల్లేలా కోరినా కేంద్రం కనికరించలేదని విమర్శించారు. 'మా పన్ను మా హక్కు' పోరాటం ఆరంభమేనని దీనిని సాధించుకునేంతవరకు విశ్రమించే ప్రశ్నే లేదన్నారు. 2024లో కాంగ్రెస్‌కు 20మంది ఎంపీలను ఇస్తే వీటిని సాధించి చూపిస్తామని సీఎం ప్రకటించారు.



ఢిల్లీలో ధర్నా అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

## రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ : బీజేపీ



బసవరాజ్ బొమ్మై, విజయేంద్రను తరలిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొని ఉందని, శాసనసభ్యులను సచివాలయంలోకి రాకుండా తాళాలు వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి పరాకాష్ట అని బీజేపీ విరుచుకుపడింది. రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా సచివాలయంలోని గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ బుధవారం ధర్నా నిర్వహించింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర సారథ్యంలో జరిగిన ధర్నాలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, శాసనసభ ప్రతిపక్షనేత ఆర్ అశోక్, పరిషత్‌లో ప్రతిపక్షనేత కోట శ్రీనివాస పూజారి, ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. అనంతరం విధానసౌధ ముట్టడికి బయల్దేరిన నేతలను పోలీసులు అరెస్టు చేసి ఆపై విడుదల చేశారు.

### మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక కాంగ్రెస్ సర్కార్ ఖతం : బొమ్మై

కేంద్రంలో నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన నెలలోపే రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు ముక్కలు కానుందని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై జోస్యం చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ధర్నా సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 15వ ఆర్థిక సంఘానికి సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే కేటాయింపులు తగ్గాయని, ఇందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేరుగా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గతంలోని యూపీఏ ప్రభుత్వాలతో పోలిస్తే మోదీ ప్రభుత్వం కర్ణాటక అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ ఢిల్లీలో ధర్నా పేరిట హై డ్రామా చేస్తోందన్నారు. మోదీ పాలనలో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉండడం నిజంగా అదృష్టమన్నారు. ఇందుకు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి కేంద్రంపై అభాండాలు వేస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఢిల్లీ నాటకాన్ని ప్రజలు విశ్వసించబోరని ప్రతిపక్షనేత ఆర్. అశోక్ పేర్కొన్నారు. రాష్ట్ర పాలనను గాలికి వదిలేసి ఢిల్లీలో ధర్నా చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, ప్రజలను ఎంతకాలం ఇలా అబద్ధాలతో మభ్య పెడతారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలంతా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

# ఏకమైన 118 జంటలు

### సుత్తూరు జాతరలో సామూహిక వివాహాలు

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** మైసూరు జిల్లాలోని సుత్తూరు జగద్గురు శివరాత్రీశ్వర శివయోగి జాతర మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ, కనకగిరి పీఠం నిరంజనానందపురి స్వామిజీ, తిరువనంతపురం శాంతిగిరి ఆశ్రమ ప్రధాన కార్యదర్శి గురురత్నంల సమక్షంలో బుధవారం ఏర్పాటైన సామూహిక వివాహాల్లో 118 మంది దాంపత్య జీవనంలోకి అడుగుపెట్టారు. వీరిలో తమిళనాడుకు చెందిన 23, దివ్యాంగులైన 4 జంటలు ఉండడం విశేషం. ఈ సందర్భంగా వధూవరుల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరభద్రేశ్వర కొండోత్సవంలో పశువుల పరుష నిర్వహించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఉత్సవంలో పారిశ్రామికవేత్త మూలచంద్, ఎమ్మెల్యే రామమూర్తి, అమెరికాలోని మేరిల్యాండ్‌కు చెందిన వీరప్పన్, వాషింగ్టన్‌కు చెందిన శివానంద్ పాల్గొన్నారు. 2000 నుంచి 2023 వరకు సుత్తూరు క్షేత్రంలో ఏటా నిర్వహించే సామూహిక వివాహాల్లో ఇంతవరకు 3076 మంది ఏకమయ్యారు. కాగా ప్రతి నెలా నిర్వహించే వివాహ కార్యక్రమాల ద్వారా ఇంత వరకు 457మంది జంటలు దాంపత్యజీవనంలోకి అడుగుపెట్టగా ఇలా ఇంతవరకు 3533 జంటలకు పెళ్లిళ్లు జరిగాయి. తొలిరోజు ఉత్సవాలను మంత్రి దినేశ్ గుండూరావు లాంఛనంగా ప్రారంభించారు. ఆరు రోజులపాటు సాగే ఉత్సవాల్లో ఆధ్యాత్మికతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని కొనియాడారు. మంత్రి మధు బంగారప్ప కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఎస్ఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొంటున్న వారందరికీ తగిన సదుపాయాలు కల్పిస్తున్నట్లు మఠం నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ



వేదికపై వధూవరులు

చేతులెత్తి మొక్కుతా...

## మేకెదాటుకు అనుమతులివ్వండి

### రాజ్యసభలో మాజీ ప్రధాని దేవెగౌడ



రాజ్యసభలో దేవెగౌడ

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో తాగునీటి సమస్య రానున్న రోజుల్లో మరింత జఠిలం కానుందని, ఈ నేపథ్యంలో 30టీఎంసీల సామర్థ్యం కల్గిన మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి మాజీ ప్రధాని దేవెగౌడ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో మంగళవారం ప్రసంగించిన ఆయన చేతులెత్తి మొక్కుతా... ప్రాజెక్టుకు సాధ్యమైనంత త్వరగా అన్ని అనుమతులు ఇవ్వాలని వేడుకున్నారు. సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన తమిళనాడు న్యాయవాదులే స్వయంగా మెట్టూరు రిజర్వాయర్ ఎగువభాగంలో కర్ణాటక ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మించుకుంటే అభ్యంతరం లేదన్న సంగతిని గుర్తు చేశారు. రాష్ట్ర తాగునీటి అవసరాలకే తప్ప తమిళనాడుకు ఇబ్బంది కలిగించాలన్న ఉద్దేశ్యంతో మేకెదాటు ప్రతిపాదన చేయడం లేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలను పరోక్షంగా ప్రస్తావించిన ఆయన తాత్కాలిక రాజకీయ లబ్ధికోసమే వీటిని చేపట్టారని, అయితే మోదీ గ్యారెంటీ పథకాలు చాలా భిన్నంగా బాగున్నాయంటూ ప్రశంసలు గుప్పించారు. కర్ణాటక ప్రయోజనాలు కాపాడే విషయంలో శక్తి ఉన్నంతవరకు పోరాడుతూ ఉంటానని ఆయన ప్రకటించారు.

బళ్లారిలో

## ఐటీ దాడులు

### కాంట్రాక్టర్ కార్యాలయం, ఇల్లు, బంధువుల ఇళ్లలో సోదాలు

### దస్తావేజులు, కంప్యూటర్లు స్వాధీనం

**బళ్లారి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):** బళ్లారిలో ప్రముఖ కాంట్రాక్టర్‌గా పేరుగాంచిన పిచ్చేశ్వరరావుకు సంబంధించిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కార్యాలయం, సిరుగుప్పలోని ఆయన ఇల్లు, బంధువులు, కార్యాలయ సిబ్బంది ఇళ్లపై బుధవారం ఆదాయపు పన్నుల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆరుగురు అధికారులు బళ్లారి తాళ్లూరు రోడ్డులోని కార్యాలయం, సిరుగుప్పలోని నివాసంలో ఏక కాలంలో సోదాలు చేశారు. కంప్యూటర్లు, దస్తావేజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పిచ్చేశ్వరరావు 2023 ఏడాదిలో సుమారు రూ. 5 వేల కోట్లు విలువ చేసే పనులు చేసినట్లు సమాచారం. ఆయన ఇంతకు ముందు కూడా వేల కోట్లలో పనులు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయపు పన్ను చెల్లించకుండా తప్పుడు రికార్డులు చూపి ఎగవేసినట్లు ఐటీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన ఐటీ శాఖ అధికారులు కార్యాలయంతో పాటు సిరుగుప్పలోని ఇంటిపైనా, బళ్లారి ఇన్నారెడ్డి కాలనీలో ఉండే ఆయన సోదరుడు, బంధువులు, ప్రధాన కార్యాలయ సిబ్బంది ఇళ్లపై కూడా దాడులు చేశారు. సోదరుడు, పిచ్చేశ్వరరావు ఇళ్లలో విలువైన దస్తావేజులు, బంగారు, ఖరీదైన వస్తువులను గుర్తించినట్లు సమాచారం. ఈ విషయంపై ఐటీ అధికారులను పాత్రికేయులు సంప్రదించగా.. దస్తావేజులు స్వాధీనం చేసుకున్నామని, ఇతర వస్తువులకు సంబంధించిన ఇంకా లెక్కలు వేస్తున్నామని, పూర్తి వివరాలు తరువాత వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# నేడు సీఎం మెగా జనతాదర్శన్

### విధానసౌధ ప్రాంగణంలో నిర్వహణ

### పూర్తయిన ఏర్పాట్లు

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** రాజధాని బెంగళూరులోని విధానసౌధ ప్రాంగణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం మెగా జనతాదర్శన్ నిర్వహించనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రికి చెప్పుకునేందుకు తరలిరానున్నారు. ఈ మేరకు విధానసౌధ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విధానసౌధకు చేరుకునేందుకు వీలుగా మెజస్టిక్ నుంచి ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. తమ కష్టాలు నివేదించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి రానున్న ప్రజలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. రాష్ట్ర స్థాయి జనస్పందన ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంట వరకు కొనసాగనుంది. జనం అధికంగా హాజరైతే మరో గంట అదనంగా సమయాన్ని కేటాయించాలని సీఎం నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోసం అన్ని శాఖల ఉన్నతాధికారులను గురువారం అందుబాటులో ఉండాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. జనస్పందన పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను నేరుగా సీఎంతో చెప్పుకోవాలనుకునేవారు ముందుగా ఆన్‌లైన్‌లో 1902కు ఫోన్‌చేసి రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రత్యేకించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి, గృహజ్యోతి, అన్నభాగ్య, గృహలక్ష్మి, యువనిధి పథకాల ప్రగతిని కూడా సీఎం ఇదే సందర్భంగా సమీక్షించనున్నట్లు సమాచారం. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మొబైల్ శౌచాలయాలను, తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

#### శాఖలవారీగా వినతుల స్వీకరణ

జనస్పందనలో శాఖలవారీగా వినతి పత్రాలను స్వీకరిస్తామని, ఇందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు బుధవారం మీడియాకు చెప్పారు. తొక్కిసలాట, గందరగోళానికి తావు లేని విధంగా దరఖాస్తు ఏ కౌంటర్‌లో అందజేయాలో సమాచారం అందించే ఏర్పాట్లు చేశామన్నారు.

#### 3,738 అర్జీలకు పరిష్కారం

ముఖ్యమంత్రి సిద్దరామయ్య బెంగళూరులో నవంబరు 27న నిర్వహించిన జనతాదర్శన్‌లో మొత్తం 4030 అర్జీలను స్వీకరించగా అందులో ఇప్పటికే 3738 అర్జీలను క్లియర్‌చేసి సమస్యలను పరిష్కరించడం జరిగిందని అధికారులు వెల్లడించారు.





విధానసౌధ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు




బావిని తవ్వుతున్న గౌరినాయక

# గంగ కోసం గౌరి సాహసం

### అంగన్‌వాడీ చిన్నారుల దాహార్తి తీర్చేందుకు ఓ మహిళ తపన

### ఒంటరిగానే బావి తవ్వుతున్న వైనం

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఉత్తరకన్నడ జిల్లా శిరసికి అనుబంధమైన గణేశనగర్‌లో అంగన్‌వాడీ చిన్నారుల దాహార్తి తీర్చేందుకు ఓ మహిళ పెద్ద సాహసానికే సిద్ధమయింది. 55 ఏళ్ల గౌరినాయక అనే మహిళ బావిని తవ్వేందుకు పూనుకుంది. సుమారు నాలుగు అడుగుల విస్తీర్ణంతో కూడిన బావిని తవ్వుతోంది. గడ్డపార, పార, పెనుము ఇతరత్రా అన్నీ ఆమె సమకూర్చుకుంది. ఇలా రోజూ ఒకటిన్నర అడుగు మేర తవ్వి వారం రోజులుగా శ్రమదానం చేస్తోంది. గణేశనగర్ ప్రాంతంలో కొంతకాలంగా నీటి ఎద్దడి ఉంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ చిన్నారుల కోసం బావిని తవ్వేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం అంగన్‌వాడీ చిన్నారుల కోసం బావిని తవ్వుతోంది. 50 అడుగులలో నీరు లభించే అవకాశం ఉందని విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ జ్యోతి నాయక మాట్లాడుతూ ఇక్కడి కేంద్రంలో 15 మంది పిల్లలు ఉన్నారని, హుత్గార గ్రామపంచాయతీ నుంచి రెండు రోజులకోమారు నీరు వదులుతున్నారని తెలిపారు. తాగేందుకు మాత్రం బయటి నుంచి తెచ్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో గౌరినాయక ఇక్కడి సమస్యను గుర్తించి స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తున్నారన్నారు. ఆరేళ్లక్రితం గౌరినాయక ఎంతో శ్రమకోర్చి సుమారు 65 అడుగుల మేర బావిని తవ్వింది. ఎట్టకేలకు నీరు లభించడంతో ప్రశంసలు లభించిన గౌరి తాజాగా మరో బావిని తవ్వుతోంది.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1588.09 | 1,614.08 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 000 | 000 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 272 | 9,732 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 9.51 | 46.27 |

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెల

● ప్రైవేటు వ్యక్తులకే రైతుల అమ్మకాలు ● ఫలించని ప్రభుత్వ మద్దతుధరల విధానం

**బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలకు ఆదరణ కరువైంది. ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటుచేసినా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెల రోజులైనా ఒక్క రైతు కూడా పేర్లను నమోదు చేసుకోలేదు. బళ్లారి తుంగభద్ర జలాశయం ఆయకట్టు కింద సాగుచేసే పంటల్లో వరి ప్రధానమైంది. ఈఏడాది ఖరీఫ్‌లో రైతులు వరిసాగు చేశారు. ధర అనుకున్న దానికంటే ఎక్కువ పలికింది. ఈనేపథ్యంలో వ్యాపారులు పొలాల వద్దకే చేరుకుని నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీంతో ఒక్కసారిగా బియ్యం ధర పెరిగిపోయింది.

ఖరీఫ్‌లో రైతులు పండించిన వరి, రాగి, జొన్నలను విక్రయించుకోవడానికి వీలుగా జిల్లా వ్యాప్తంగా ఆహార పౌరసరఫరాల శాఖ ఏపీఎంసీ మార్కెట్‌లో కనీసం మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. వరికి ప్రభుత్వ మద్దతుధర రూ.2183 కాగా వ్యాపారులు ప్రస్తుతం రూ. 3వేల వరకూ చెల్లిస్తున్నారు. దీంతో నేటి వరకు కొనుగోలు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవడానికి రైతులు ఎవరూ ముందుకు రాలేదు.

--71వేల హెక్టార్లలో వరి సాగు

బళ్లారి జిల్లాలో బళ్లారి, సిరుగుప్ప, కురుగోడు, కంప్లి, సండూరు తాలూకాల్లో మొత్తం 71వేల హెక్టార్లలో వరిని సాగు చేశారు. బళ్లారి తాలూకాలో 14,091 హెక్టార్లు, కురుగోడ 9652, సిరుగుప్పలో 28,759 హెక్టార్లలో వరిని సాగు చేశారు. గతేడాదిలో పోలిస్తే ఈ సారి మంచి దిగుబడి వచ్చింది. ఎకరాకు 45నుంచి 55బస్తాల వరకు దిగుబడి వచ్చింది. గతేడాది క్వింటాల్ ధర రూ. 2వేల నుంచి 2100 వరకు ఉండగా, ప్రస్తుతం రూ. 2800 నుంచి రూ. 3వేలు ,వరకు పలుకుతోంది. సోనా మసూరి కంటే ఆర్ఎన్ఆర్ క్వింటాల్‌పై రూ.200నుండి 300 ఎక్కువగా ఉంది. కొత్త బియ్యం రూ. 5వేల నుండి 5,600 వరకు పలుకుతోంది. పాత మసూరి బియ్యం క్వింటాలు రూ. 6000 నుంచి రూ. 6500 వరకు అమ్ముతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే ప్రైవేట్ వ్యక్తులు ఎక్కువధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు.



పొలాల నుంచే నేరుగా ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్న దృశ్యం

## జొన్న రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి



జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**కంప్లి, ఫిబ్రవరి 7 :** రైతులు పండించిన జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీఎంసీ మార్కెట్ అధికారులు కోరుతున్నారు. క్వింటాల్‌కు మాలదండి రకానికి రూ.3225, హైబ్రిడ్ రకానికి రూ.3180లుగా ధరలు నిర్ణయించారన్నారు. 31మార్చి 2024 వరకు వ్యవసాయ శాఖ ఈ అవకాశం కల్పించిందని, ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఇచ్చిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతిఒక్క రైతు ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయంలో తాము పండించిన జొన్న పంట రకంతోపాటు తమ పేర్లు ముందుగానే నమోదు చేసుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వ్యాపారస్తుల వల్ల కొంతమేర నష్టపోయారని, దీంతో ఈ యేడాది ప్రభుత్వమే ముందుకొచ్చి కొనుగోలు చేస్తోందన్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో వందల ఎకరాల్లో జొన్న పంట వేశారు. జొన్నల అమ్మకాల కోసం రైతన్నలు ఇప్పటికే కార్యాలయంలో తమ పేర్ల నమోదును ప్రారంభించారు.

## ఘనంగా మహనీయుల జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ జుబేరా

**బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7:** మహనీయులైన సంత్ సేవాలాల్, సవితామహర్షి, చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ కార్యాలయహాల్లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రముఖుల జయంతి ముందుస్తు ఏర్పాట్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న వాల్మీకి కమ్యూనిటీ భవన్‌లో సంత్ సేవలాల్ జయంతిని, ఫిబ్రవరి 16న బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానం హాల్లో సవితా మహర్షి జయంతిని ఫిబ్రవరి 19న సాయంత్రం చత్రపతి శివాజీ జయంతిని, 20న సర్వజ్ఞ జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ, తాగునీరు, లౌడ్‌స్పీకర్, పరిశుభ్రత, మరుగుదొడ్ల సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. మహానుభావుల సిద్ధాంతాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు సంబంధించి నైపుణ్యం కలిగిన లెక్చరర్లతో ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మరళి ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఆరోగ్య శాఖ అధికారులు

**గంగావతి రూరల్, ఫిబ్రవరి 7:** కొప్పళ జిల్లా గంగావతి తాలూకా మరళి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్రస్థాయి కాయకల్ప పురస్కారం దక్కింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఈ ఎంపికను చేపట్టగా, మరళి గ్రామానికిచెందిన ఆరోగ్య అధికారి కుమారి శోభ, గురు హిరేమఠ్ బుధవారం కాయకల్ప పురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా లింగరాజు, విశ్వనాథ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐకి సన్మానం



నూతన సీఐని సన్మానిస్తున్న బానాపురం పంపన్నగౌడ

**బళ్లారిరూరల్, ఫిబ్రవరి 7 :** బళ్లారి తాలుకాలోని పీడీ హళ్లి, మోకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐ కాళింగలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మోకా పోలీసు స్టేషన్‌లో వారిని రక్షణ వేదిక గ్రామీణ సభ్యులు బానాపురం పంపన్న గౌడ, పూజారి యర్రిస్వామి, మంజునాథ్‌లు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేరస్థులపై ఉక్కుపాదం మోపుతానన్నారు.

## నేడు గ్రామపంచాయతీ సభ్యుల చలో బెంగళూరు

**బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7:** గ్రామ పంచాయతీ సభ్యులకు గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బెంగళూరు పోరాటం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సభ్యుల కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమ మంజునాథ్ అన్నారు. నగరంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్న పంచాయతీ సభ్యుల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో రాష్ట్రస్థాయి పోరాటంచేసి కొన్ని డిమాండ్లు నెరవేర్చుకున్నామని, అయితే ఇప్పుడు పలు కీలక డిమాండ్లతో బెంగళూరు చలో పోరాటానికి సిద్ధమయ్యామన్నారు. జిల్లా నుంచి 1500మందికిపైగా సభ్యులు, రాష్ట్రంలోని 15వేలకు పైగా సభ్యులు నిరసనలో పాల్గొననున్నారన్నారు. కేరళ రాష్ట్ర నమూనాలో పంచాయతీ ప్రెసిడెంట్‌కు రూ.15వేలు, వైస్ ప్రెసిడెంట్‌కు రూ.12వేలు, సభ్యులకు రూ.10వేలు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. సభా భృతిని సభ్యులకు రూ. 500 పెంచేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సభ్యుల పదవీ కాలం తర్వాత నెలవారీ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. సభ్యులకు ఉచిత బీమా కల్పించాలని, స్థానిక గ్రామ పాలనలో ఆర్డీపీఆర్ అధికారులు, జీపీసీఈఓ , టీపీఈఓల జోక్యాన్ని అరికట్టాలన్నారు. పంచాయతీ సభ్యుల గౌరవ వేతనాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో యూనియన్ జిల్లాప్రధాన కార్యదర్శి ఏ.శ్రీధర్ ఏళుచెంచి, సండూర్ తాలూకా అధ్యక్షుడు రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమ మంజునాథ్ తదితర సభ్యులు

## 416వ రోజుకు చేరిన కుడితిని వాసుల నిరసన

**కంప్లి, ఫిబ్రవరి 7:** కుడితిని విభాగంలోని హరిగిణదోణి, జానెకుంటి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం, కుడితిని, కొళగల్లు ఫ్యాక్టరీల కోసం పోగొట్టుకున్న భూములను తిరిగి ఇవ్వాలంటూ రైతులు చేపట్టిన నిరసన బుధవారం నాటికి 416 రోజుకు చేరింది. కాని ఇంతవరకు ఏ నాయకుడు ముందుకొచ్చి వారి సమస్యను పరిష్కరించలేకపోయారు. కానీ గాలి, వాన, ఎండను లెక్కచేయకుండా వారు నిరసనలు మాత్రం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బసవరాజు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఇదిగో అదిగో తమకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చారని, కాని ఇంతవరకు ఆ హామీలు కార్యరూపం దాల్చలేదన్నారు. బెల్గామ్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రితో కలిశామని, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు రైతులకు మాత్రం న్యాయం జరగలేదన్నారు. ఎన్నిరోజులైనా సరే ఫ్యాక్టరీల కోసం భూములు పోగొట్టుకున్న తమకు న్యాయం లభించేంత వరకు ఈ పోరాటం ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కుడితినిలో భూములు పోగొట్టుకున్న రైతులు

## మద్యపాన ప్రియులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాలలు

**కంప్లి, ఫిబ్రవరి 7 :** కొందరు దేవాలయాల కన్నా పాఠశాలలను గొప్పవిగా భావిస్తారు. కానీ అలాంటి పాఠశాలల ఆవరణలో మరి కొందరు మద్యం సేవిస్తూ వాటిని తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎలాంటి గేట్లు లేకపోవడంతో ఎవరూ లేని సమయంలో మందుబాబులు అక్కడకు చేరుకుని మద్యపానం చేస్తున్నారు. విచ్చలవిడిగా అక్కడున్న తలుపులు, ట్యాప్‌లను పగులగొడుతూ ప్రతినిత్యం ఇటు పాఠశాలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఉదయాన్నే తాగి విసిరేసిన బాటిళ్లను అక్కడున్న సిబ్బంది తీసివేసి విద్యార్థులు రాక ముందే పరిశుభ్రం చేయాల్సిన అవసరం ఏర్పడింది. అలాగే విజయ హైస్కూలు వెనుకభాగంలో గత కొన్ని రోజుల క్రితమే గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి పాఠశాల గదుల తలుపులను పగులగొట్టారు. ఈ పాఠశాలలకు గేట్లు లేకపోవడంతో వీరికి అడ్డాగా మారాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నిసార్లు శుభ్రం చేసుకున్నా రాత్రివేళల్లో విచ్చలవిడిగా అపరిశుభ్రం చేస్తూ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు గేట్లు ఏర్పాటుచేసి మద్యపానం చేసేవారికి అవకాశం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పాఠశాల గదుల తలుపులను ధ్వంసం చేసిన దృశ్యం



పాఠశాల వద్ద తాగి విసిరేసిన మద్యం బాటిళ్లు

## పరిపాలన సాఫీగా సాగడానికి రాజ్యాంగమే ప్రధానం

**సిరుగుప్ప, ఫిబ్రవరి 7:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజా ప్రభుత్వ పరిపాలన సాఫీగా సాగడానికి ముఖ్య కారణంగా మారిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్ తెలిపారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో నేతాజీ వ్యాయామశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న జన జాగృతి వేదిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 3 నుంచి 9వ తేదీ వరకు జన జాగృతి ర్యాలీ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాజ్యాంగం విషయాలను ప్రజలకు సంక్షిప్తంగా తెలియజేయడమే జన జాగృతి కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షులు కొడ్లి మల్లికార్జున మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో అంశాలు అందులో పేర్కొన్నారని ఆయన తెలిపారు. రాజ్యాంగ రచనకు మూడేళ్ల పాటు ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి, ఎస్సీ సంక్షేమ శాఖ డైరెక్టర్ రాఘవేంద్ర, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కళ్యాణం



శ్రీనివాస కళ్యాణోత్సవంలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

**కంప్లి, ఫిబ్రవరి 7 :** కంప్లి పట్టణంలో రాఘవేంద్రస్వామి ఆలయంలో శ్రీనివాస కళ్యాణోత్సవం, సత్యనారాయణ భజన మహిళా మండలి ఆధ్వర్యంలో చేపట్టారు. గత ఐదు సంవత్సరాలుగా పూజలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర హోసల్లి ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి యేటా శ్రీనివాస కళ్యాణోత్సవం, సత్యనారాయణ మహిళా మండలి, లోక కళ్యాణార్థం కోసం పూజలు ప్రతి యేడు జరుపుతున్నట్లు తెలిపారు.

## వామ్మో! అప్పుడే ఎండలు మండుతున్నాయ్

**కంప్లి, ఫిబ్రవరి 7 :** ఈ యేడాది వేసవి ప్రారంభం కాకముందే సూర్యుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రత పెరగడంతో ఉదయం 10 గంటలకే ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా మహిళలు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. రాబోయే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మరి ఇంకెంత వేడి వుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. పట్టణానికి వచ్చిన కొందరు మహిళలు గొడుగులు వేసుకుని తమ పనులు ముగించుకుంటున్నారు. మొత్తానికి గతఏడాది కన్నా ఈ ఏడాది సూర్యుడి ప్రభావం అధికంగా వున్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో ఇళ్లకే పరిమితమయ్యేలా ఎండలు వుంటాయని భావిస్తున్నారు.



గొడుగు వేసుకుని విధులకు వెళుతున్న మహిళ

## రాయచూరు సిటీ ఎమ్మెల్యే నిర్ణయంపై స్పీకర్‌కు ఫిర్యాదు

**రాయచూరు, ఫిబ్రవరి 7 :** నగరంలోని 28వ వార్డు పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా ఆ పనులను అడ్డుకున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్‌పై చర్యలు తీసుకోవాలని భీమవాది జిల్లాధ్యక్షుడు నరసింహలు కోరారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్‌ను కలిసి ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కన్నడ మాధ్యమంలోని ఉన్నత పాఠశాల కోసం కోటి రూపాయిలకు పైగా నిధులు మంజూరైనా ఆ విషయం తన దృష్టికి రాలేదన్న సాకుతో ఎమ్మెల్యే పనులను అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే తీరు సరికాదన్నారు. అదే సమయంలో కన్నడ మాధ్యమం కోసం మంజూరైన పాఠశాలను అడ్డుకోవడం ద్వారా కన్నడ ద్రోహిగా ఎమ్మెల్యే మిగిలారని ఇలాంటి వ్యక్తిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరారు.

# హోసూరు జోన్

## 11న బర్గూరులో అన్నాడీఎంకే భారీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేపీ మునిస్వామి

**హోసూరు ఫిబ్రవరి 7:** తమిళనాడులో అతిపెద్ద పార్టీ అయిన అన్నాడీఎంకేలో చేరేవారికోసం ఈనెల 11 న కృష్ణగిరి జిల్లా బర్గూరులో సమావేశః జరుగనుంది. అందుకోసం మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో హోసూరులో బుధవారం ఏర్పాట్లపై సమావేశం జరిగింది. సమావేశానికి డివిజన్ కార్యదర్శి వాసుదేవన్ అందరికీ స్వాగతం పలికారు. అలాగే ఈ సంప్రదింపుల సమావేశంలో రీజినల్ కమిటీ చైర్మెన్ జయప్రకాశ్, ఏరియా కార్యదర్శులు మంజునాథ్, రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేపీ.మునిస్వామి మాట్లాడుతూ, కృష్ణగిరి జిల్లాల్లో ఎడపాడీ పళనిస్వామి సమక్షంలో 10 వేల మంది వాలంటీర్లు, నిర్వాహకులు ఇప్పటికే అన్నాడీఎంకేలో చేరారన్నారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంపై అడిగిన ప్రశ్నకు అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యేలు బీజేపిలో చేరితే, వారు బహుశా పార్టీల్లో క్రియారహితంగా ఉండాల్సిందేనన్నారు. తమిళనాడులో ఎడపాడి పళనిస్వామి నేతృత్వంలో పెద్ద కూటమి ఏర్పడనుందన్నారు. అన్నాడీఎంకేకు తలుపులు తెరిచి ఉన్నాయన్నారు. అన్నాడీఎంకే కూటమికి 2 కోట్ల మంది వాలంటీర్లు నాయకత్వం వహిస్తున్నారన్నారు. సెక్రటరీ కుమ్మిఅలాయాస్ హేమకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశానికి వయో పరిమితిలేదు

**హోసూరు ఫిబ్రవరి 7 :** న్యూఢీల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఒపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం హోసూరు పెరుమాళ్ మణిమేగలై పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంల్లో 20 ఏళ్లుగా పనిచేస్తోందని, ఈ కేంద్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు జరుగుతున్నాయని కో ఆర్డినేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. బిఏ, బి.ఎస్సీ, బీ.కాం, బి.ఎస్.డబ్ల్యూ, బి.సి.ఏ వంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, ఎం.ఏ, ఎం.కాం, ఎం.ఎస్, వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఎంఎస్ఎం అనేది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సని, ఇది వ్యాపారవేత్తలు, చిన్న వ్యాపార యజమానులు, కొత్త వ్యాపారాన్ని ప్రాంరంభించాలనే వారు, విద్యార్థులందరికీ ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. అలాగే ఈ కేంద్రంలో ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సులు కూడా నడుస్తుండగా అడ్మిషన్లు కూడా జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు చాలా తక్కువ ఫీజు చెల్లిస్తే చాలని, ఎవ్వరికి వయోపరిమితి లేదని తెలిపారు. ఈ కోర్సులను ఇంటి నుంచి లేదా. కార్యాలయం నుంచి చదవవచ్చునని, ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతం అడ్మిషన్లు కూడా నడుస్తుండగా, ఇందులో చేరిన విద్యార్థులకు ఉత్తమ ప్రొఫెసర్లతో వారం వారం ఆదివారం కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ కోఆర్డినేటర్ సుధాకరన్‌ను సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

## అన్నాడీఎంకే తరఫున ప్రభుత్వానికి వినతి పత్రం

**హోసూరు ఫిబ్రవరి 7:** అసెంబ్లీ నియోజక వర్గం వేపనహళ్లీలో జరిగిన అన్నాడీఎంకే సమావేశంలో తళి, కెలమంగలం, శూలగిరి, హోసూర్‌లను రక్షిత ఉద్యాన వ్యవసాయ జోన్‌గా ప్రకటించాలని కోరుతూ ఉద్యానవన రైతులందరి తరఫున ప్రభుత్వానికి వినతిపత్రం అందించారు. శూలగిరి, కెలమంగలం, తళి హోసూరు పంచాయతీ యూనియన్ల పరిధిల్లోని ప్రాంతాలను ప్రత్యేక ఉద్యనవన రక్షిత వ్యవసాయ మండలంగా ప్రకటించాలని కోరారు.



రైతు సంఘాల తరపున వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వాల బాధ్యత

● అదే భారత రాజ్యాంగ స్ఫూర్తి

● శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్

**రాయచూరు, ఫిబ్రవరి 7 :** ప్రభుత్వాలు ఏవైనప్పటికీ ప్రజలకు సుపరిపాలన అందించడమే వాటి లక్ష్యమని అదే భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన సందేశమని శాసన సభ స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన స్పీకర్ కొద్దిసేపు విలేఖరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన శాసనసభ్యులు విధిగా సమావేశాలకు హాజరు కావాలన్నారు. సీనియర్ నాయకుల ప్రసంగాలు వినడంతో పాటు సభలో ఆద్యంతం కాలం గడపడం ద్వారా శాసనసభ వ్యవహారాలపై పట్టు సాధించాలన్నారు.

అదే సమయంలో తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న ప్రజల సమస్యలను చట్టసభలో ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. ఎంతో మంది నాయకులు శాసనసభ సభ్యులుగా ఎన్నికయ్యారని కొద్దిమంది ప్రసంగాలు మాత్రమే చిరకాలం గుర్తు ఉంటాయన్న విషయాన్ని స్పీకర్ స్పష్టం చేశారు. కాగా ఈ సారి శాసనసభ సమావేశాలను వీక్షించే అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలకు కల్పించే ఉద్దేశంతో తాము నిర్ణయం తీసుకోబోతున్నట్లు స్పీకర్ తెలిపారు. అదే సమయంలో శాసనసభకు రెగ్యులర్‌గా హాజరయ్యే వారికి, ఆద్యంతం చర్చల్లో పాల్గొనే వారికి తగిన బహుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న శాసన సభ స్పీకర్ యూటీ ఖాదర్

## బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన రవి(ఫైల్)

**రాయచూరు, ఫిబ్రవరి 7 :** వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడిని ఢీ కొట్టడంతో బైక్ పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ దురదృష్టకర సంఘటన బుధవారం ఉదయం జిల్లాలోని మాన్వి తాలూకా నీరమాన్వి వద్ద సంభవించింది. ప్రత్యేక్ష సాక్షులు, పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు నీరమాన్వి నుంచి బైక్ పై మాన్వి వైపు వెళుతున్న రవి(25)ని ఎదురుగా రాయచూరు వస్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడు రవి మాన్వి పట్టణానికి చెందినవాడు కాగా బట్టల దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. రవికి 8 నెలల క్రితమే వివాహం జరగగా అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడడంతో కుటుంబ సభ్యుల రోధన చూసేవారిని కలిచివేసింది. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ఆస్పత్రికి తరలించారు. మాన్వి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# రాష్ట్రంపై చిన్నచూపు ఏల?

» ఢిల్లీ ధర్నాలో ఎమ్మెల్సీ సీతారాం

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారామ్ ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సారథ్యంలో బుధవారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సమాఖ్య బలంగా ఉండాలంటే రాష్ట్రాలు కూడా బలంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు ఒక కర్ణాటకలోనే కాకుండా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా అమల్లో ఉన్నాయని మరి ఆ రాష్ట్రాలకు లేని సమస్య కర్ణాటక విషయంలోనే ఎందుకని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలైనప్పటి నుంచి కేంద్రం పాలకులు తట్టుకోలేకపోతున్నారని ఇప్పుడు ఏకంగా నిధుల విడుదల విషయంలో కక్ష సాధింపుచేస్తున్నారని ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్రం తన మొండి వైఖరిని విడనాడాలని రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు గ్రాంట్లను తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య మాట్లాడుతూ కర్ణాటకకు జరుగుతున్న అన్యాయంపై నిలదీసేందుకు కేంద్రం కళ్ళు తెరిపించేందుకే ఢిల్లీకి రావాల్సి వచ్చిందన్నారు. ధర్నాలో మంత్రులు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం, మంత్రి దినేశ్ గుండూరావు

## కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించిన బెంగళూరు వాసి

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఆఫ్రికాలోనే అతి ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని నగరానికి చెందిన గౌతమ్ పుట్టమాదయ్య అనే యువకుడు అధిరోహించాడు. బెంగళూరు చుట్టు పక్కల కొండలపై ట్రెక్కింగ్ చేస్తూ క్రమేపీ పర్వతారోహణంపై ఆసక్తి పెంచుకున్న గౌతమ్ ఎలాంటి ప్రత్యేక శిక్షణ తీసుకోకుండానే ఈ లక్ష్యాన్ని గణతంత్ర దినోత్సవం రోజున పూర్తిచేశాడు. ప్రతిరోజూ 15 కిలోమీటర్ల నడకతో 19,340 అడుగుల ఎత్తయిన ఈ పర్వాతాన్ని అధిరోహించిన గౌతమ్ అక్కడ భారతీయ పతాకాన్ని ఎగురవేశాడు. ఎత్తయిన కిలిమంజారో పర్వాతాన్ని విజయవంతంగా అధిరోహించి బుధవారం నగరానికి తిరిగి వచ్చిన గౌతమ్‌కు అభిమానులు శ్రేయోభిలాషులు ఘనస్వాగతం పలికారు. వాతావరణం బాగా అనుకూలించడంతో పర్వతాన్ని సులభంగా అధిరోహించగలిగానని ఇది తన జీవితంలో ఒక మధురస్మృతి కానుందని గౌతమ్ పుట్టమాదయ్య మీడియాకు చెప్పాడు. కాగా పుట్టమాదయ్య సాధనపట్ల పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు.



శిఖరాగ్రాన గౌతమ్ పుట్టమాదయ్య

## రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్

**చింతామణి, ఫిబ్రవరి 7:** పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డు నుంచి అంజని లే అవుట్ ఫిల్టర్‌బెడ్ సర్కిల్ వరకు ప్రత్యేక గ్రాంటుతో చేపట్టిన సీసీ రోడ్డు పనుల నాణ్యతను నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి బుధవారం పరిశీలించారు. నగరసభ పరిధిలో పలు అభివృద్ధి పనులను రూ.10కోట్లతో చేపట్టారు. రోడ్డు పనులలో నాణ్యత పాటించాలని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నగరసభ కమిషనర్ హెచ్చరించారు. నగరసభ జేఈ ప్రసాద్‌తో కలసి పనుల ప్రగతిని పరిశీలించారు. కొన్ని చోట్ల సీసీ రోడ్డు పనులు, కొన్ని చోట్ల డాంబరీకరణ పనులు సాగుతున్నాయన్నారు. కాగా రోడ్డు పనుల నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి కనెక్షన్‌లను ప్రజలు బిల్లులు చెల్లించి పొందాలని సూచించారు. కాగా పనులు నిర్ణయించిన గడువులోగా సక్రమంగా పూర్తి చేయాలని కంట్రాక్టర్‌లకు సూచించారు.



నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్, జేఈలు

## దొడ్డబొమ్మనహళ్లి పాల సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ

**చింతామణి, ఫిబ్రవరి 7:** తాలూకాలోని దొడ్డబొమ్మనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా కే వెంకటేశ్‌గౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో సీ వీరభద్రప్ప గెలుపొందారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు బుధవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి వెంకటేశ్‌గౌడ మాత్రమే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి సీనప్ప ప్రకటించారు. ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో సీ వీరభద్రప్ప, మహేశ్‌లు నామినేషన్ వేయగా వీరభద్రప్పకు 7 ఓట్లు, మహేశ్‌కు 5 ఓట్లు దక్కాయని ఉపాధ్యక్షుడిగా వీరభద్రప్ప ఎన్నికయ్యారని అధికారి ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు వెంకటాచలప్ప, నవీన్ కుమార్, నారాయణస్వామి, మహేశ్, వెంకటేశప్ప, ఎం రవి, శంకరప్ప, కృష్ణప్ప, శివారెడ్డి, సుజాతమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులతో డైరెక్టర్లు

## అయోధ్య రైలుకు పచ్చజెండా

**బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):** అయోధ్యలోని బాలరాముడి సందర్శనార్థం బయల్దేరిన భక్తుల రైలుకు తుమకూరు రైల్వే స్టేషన్‌లో పచ్చజెండా చూపారు. అయోధ్య రామమందిరాన్ని సందర్శించేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందని ఎమ్మెల్యేలు జ్యోతిగణేశ్, సురేశ్‌గౌడల అభిప్రాయపడ్డారు. బీజేపీ కార్యదర్శి అంబికా హులినాయ్కర, రామమందిర దర్శన అభియాన రాష్ట్ర సహసంచాలకులు జగదీశ్ హిరేమని, జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, అభియాన రైల్వే ప్రముఖుడు విజేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు విభాగం రైల్వే మేనేజర్ యోగేశ్ మోహన్, అదనపు విభాగం రైల్వే మేనేజర్ కుసుమా హరిప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ వీకే అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.




పచ్చజెండా చూపుతున్న ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, సురేశ్‌గౌడ తదితరులు

## కెరగూడులో అశాంతికి దుష్టశక్తుల కుట్ర

» కాంగ్రెస్ ఎమ్మెల్యే గణిగ రవికుమార్



మీడియాతో ఎమ్మెల్యే గణిగ రవికుమార్

**బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** మండ్య జిల్లాలోని కెరగూడు గ్రామంలో పరిస్థితి క్రమేపీ కుదుట పడుతున్నా అక్కడ అశాంతిని సృష్టించేందుకు కొన్ని దుష్టశక్తులు కుట్ర పన్నుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే గణిగ రవికుమార్ ఆరోపించారు. మండ్యలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9న జరగనున్న బంద్ సందర్భంగా ఎలాంటి హింసాకాండ జరిగినా అందుకు బీజేపీ, సంఘ్ పరివార్‌తోపాటు జేడీఎస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా ఎగురవేసిన కాషాయధ్వజాన్ని తొలగించడంతో బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రశాంతంగా ఉన్న జిల్లాలో నిప్పు రాజేస్తోందన్నారు. ఒకవేళ పరిస్థితి అదుపు తప్పితే అందరికీ నష్టమని హెచ్చరించారు. 9న జరగనున్న బంద్‌ను విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే బంద్ జరిగి తీరుతుందని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించాయి. బంద్‌కు మద్దతు ఇవ్వాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. కులమతాలకు అతీతంగా మండ్యలో తాము అభివృద్ధి చేస్తుంటే మతోన్మాద శక్తులు హింసాకాండను ప్రేరేపిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అప్పేగౌడనహళ్లి డెయిరీ అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి

**శిడ్లఘట్ట, ఫిబ్రవరి 7:** తాలూకాలోని అప్పేగౌడనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులైన హనుమంతరెడ్డి, వెంకటేశ్‌లు ఎన్నికయ్యారు. నూతన డైరెక్టర్‌లై శ్రీనివాస్, గోపాలప్ప, నాగేశ్, అంబరీశ్, యశోదమ్మ, మూర్తి, మనోజ్, కేశవమూర్తిలు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో కలసి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను భేటీ అయి తమ విజయానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పాడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని నూతన అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా త్యాగరాజ్, తాలూకా పంచా యతీ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామ పంచాయతీ సభ్యులు దేవప్ప, మునీంద్ర, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షులైన మంజుళమ్మ మునివెంకట స్వామి, గ్రామ ప్రముఖులు మునిరెడ్డి, నాగరాజ్, నారాయణస్వామి, ఏఎస్ మంజునాథ్, బ్యాంకు డైరెక్టర్ శ్రీరామ్, అనిల్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలసంఘం నూతన పదాధికారులను ఆత్మీయంగా సత్కరించారు.



ఎమ్మెల్యేతో నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు

## వేర్వేరు చోట్ల శ్రీగంధం చెట్ల చోరీ



నరికివేసిన చెట్లను చూపుతున్న ఖలీల్‌బేగ్

**చింతామణి, ఫిబ్రవరి 7:** తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి నల్లగుట్ట గ్రామం చుట్టుపక్కల పెంచిన శ్రీగంధం చెట్లను దుండగులు తొలగించి చోరీకి పాల్పడ్డారు. ఈనెల 5, 6 తేదీలలో చెట్లు చోరీకి గురైనట్టు వేర్వేరు రైతుల ఫిర్యాదు మేరకు బట్లహళ్ళి పోలీసులు మొత్తం 4 కేసులు నమోదు చేశారు. వేర్వేరు సర్వే నెంబర్లలోని శ్రీగంధం చెట్లను నరికివేశారన్నారు. ఖలీల్‌బేగ్, తౌసిఫ్, కృష్ణారెడ్డి, శ్రీనివాసప్పలు ఫిర్యాదు చేశారు. కొన్ని 9ఏళ్లవి కాగా మరికొన్ని 15ఏళ్ల శ్రీగంధం చెట్లను నరికివేశారన్నారు. 6-10 అడుగుల పొడవైన పెద్దసంఖ్యలోని శ్రీగంధం దుండగుల విలువ లక్షలాది రూపాయలు విలువ చేస్తాయన్నారు.

### ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**చింతామణి, ఫిబ్రవరి 7:** సినిమా ఫక్కీలో లారీలోపల ఎర్రచందనం దుంగలు ఉంచి రవాణా చేసిన వైనం వెలుగు చూసింది. చింతామణి రూరల్ పోలీసులు నిర్వహించిన కార్యాచరణలో పశువులను తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 392 కిలోలు కలిగిన 12 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. ఎవరికీ కనిపించకుండా ప్లాస్టిక్ కవర్ వేసి దానిపై పశువులను కట్టి తరలిస్తున్నారని డీఎస్పీ మురళీధర్ బుధవారం మీడియాకు తెలిపారు. కార్యా చరణలో రూరల్ సీఐ శివరాజ్, ఎస్ఐలు శివరాజ్, మమతా నేతృత్వంలో హిరేకట్టిగేనహళ్ళి వద్ద తనిఖీలు చేయగా దుంగలు బయటపడ్డాయన్నారు. టెంపో, సీమ ఆవు స్వా. దీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న దుంగలు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### వీణ వెంకటరమణ దాస్ (జయంతి)



వీణ వెంకటమరణ దాస్ 1866 ఫిబ్రవరి 8న సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. ఆయన తాత, మైసూరు వీణ శేషణ్ణలు అన్నదమ్ములు. విజయనగర ఆస్థానంలో వీణా వాదకుడిగా చోటు పొందారు. ఆయన నివసించిన ప్రదేశం కాలక్రమంలో వీణావారి వీధిగా పేరొందింది. ఆయన సితార్, రుద్రవీణ వాదనలోనూ రాణించారు. షట్‌కళా చక్రవర్తి బిరుదు పొందారు. 'వీణ రహస్య ప్రకాశిక' అనే పుస్తకాన్ని రచించగా ఇందులో 12 సంస్కృత శ్లోకాలతో వీణ వాదనలోని కిటుకులు పొందుపరిచారు. 1948 ఫిబ్రవరి 28న పరమపదించారు.

### శోభా గుర్టు (జయంతి)



హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో 'తుమ్రి క్వీన్'గా పేరొందిన శోభా గుర్టు 1925 ఫిబ్రవరి 8న బెళగావిలో జన్మించారు. సెమీ క్లాజికల్‌లో భాగంగా తుమ్రి, దాద్రా, కజ్రి, హోరి వంటి వాటిలో రాణించారు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి కచేరీలు ఇచ్చారు. హిందీ, మరాఠీ సినిమాలలోనూ నటించారు. ఐదు దశాబ్దాల సేవలకు సంగీత నాటక అకాడమీ అవార్డు, లతా మంగేష్కర్ పురస్కార్, సాహు మహరాజ్ పురస్కార్, పద్మభూషణ్ తదితర అవార్డులు దక్కాయి. 2004 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

### పొత్తూరి వెంకటేశ్వర రావు (జయంతి)



పాత్రికేయ రంగంలో సత్తా చాటుకున్న పొత్తూరి వెంకటేశ్వర రావు 1934 ఫిబ్రవరి 8న గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించారు. 50 సంవత్సరాలలో పలు పత్రికలలో పనిచేశారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లో బోధనలు చేశారు. పత్రికా సంపాదకులుగా, ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక అంశాలు, తెలుగు మహనీయులు, పత్రికా విలువలు, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ మొదలైన అంశాలపై రచనలు చేశారు. 2017లో ఉగాది సందర్భంగా కళారత్న పురస్కారం అందుకున్నారు. 2020 మార్చి 5న కన్నుమూశారు.

### జగ్జీత్ సింగ్ (జయంతి)



'గజల్ కింగ్'గా పేరొందిన మరపురాని మధురగీతాలు, గజల్స్‌ను ఆలపించిన నేపథ్య గాయకుడు జగ్జీత్‌సింగ్ 1941 ఫిబ్రవరి 8న రాజస్థాన్ రాష్ట్రం గంగాధర్ ప్రాంతంలో జన్మించారు. హిందీ, ఉర్దూ, పంజాబీ, బెంగాలీ, గుజరాతీ, నేపాలీ భాషలలో గజల్స్ ఆలపించారు. పద్మభూషణ్, రాజస్థాన్ రత్న, సాహిత్య అకాడమీ అవార్డు, లతా మంగేష్కర్ సమ్మాన్ తదితర పురస్కారాలు పొందారు. 2011 అక్టోబరు 10న కన్నుమూశారు.

### కేఎం మున్షీ (వర్ధంతి)



భారతీయ విద్యాభవన్ ఫౌండర్, విశ్వహిందూ పరిషత్ సంస్థాపక సభ్యులలో ఒకరైన కన్హయలాల్ మాణెక్‌లాల్ మున్షీ 1887 డిసెంబరు 30న జన్మించారు. 'ఘన శ్యామ్ వ్యాస్' కలం పేరిట గుజరాతీ, ఇంగ్లీషు, హిందీ భాషలలో రచనలు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. గుజరాత్‌కు చెందిన ఆయన రచయిత, విద్యావేత్త, రాజకీయ నాయకుడిగా రాణించారు. వృత్తి రీత్యా న్యాయవాది అయినా రచనలు, రాజకీయాలకే పరిమితమయ్యారు. రాజ్యాంగ నిర్మాణ కమిటీ సభ్యులలో ఒకరు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా, కేంద్రమంత్రిగా వ్యవహరించారు. 1971 ఫిబ్రవరి 8న కన్నుమూశారు.

### మహమ్మద్ అజారుద్దీన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత మహమ్మద్ అజారుద్దీన్ 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జన్మించారు. అజర్‌గా పిలువబడ్డారు. భారత క్రికెట్‌జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా రాణించారు. 99 టెస్టులు, 334 వన్డే మ్యాచ్‌లు ఆడారు. అర్జున అవార్డు, ఇతర పురస్కా రాలు పొందారు. 2009 నుంచి 2014వరకు ఎంపీగా కొనసాగారు. 2019లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కీలకంగా ఉన్నారు.

## విద్యుత్ తీగలు చోరీ

**శిడ్లఘట్ట, ఫిబ్రవరి 7:** శిడ్లఘట్ట తాలూకాలోని దిబ్బూరహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌తీగల చోరీకి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బశెట్టిహళ్ళి సమీపంలోని గౌడహళ్ళి 2.20 కేవీ విద్యుత్ తీగలను కొంతమంది చోరీ చేశారు. పోలీసులు కార్యాచరణ నిర్వహించి ఎట్టకేలకు అరెస్టు చేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లా హొస్కోటె తాలూకా బయలు నరసాపురకు చెందిన రిజ్వాన్ ఖాన్, హొస్కోటెకు చెందిన మహ్మద్ సిద్దిక్, బెంగళూరు చామరాజపేటకు చెందిన అయాజ్‌గా గుర్తించారు. నిందితుల నుంచి రూ.5.50 లక్షల నగదు, చోరీకి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యాచరణలో జిల్లా ఎస్పీ డీఎల్ నాగేశ్, ఏఎస్పీ ఖాసిమ్‌ల మార్గదర్శకత్వంలో చింతా మణి విభాగం మురళీధర్ నేతృత్వంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రాజేశ్వరి, నాగరాజ్ పాల్గొన్నారు.

## బండెపాళ్యలో కావేరి నీరు

**బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 7:** నియోజకవర్గంలోని బండెపాళ్య ప్రాంతంలోని అంబేడ్కర్ నగర్‌లో హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో కావేరి నీటి సదుపాయాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల పోరాటం చేయగా ఇటీవల పైప్‌లైన్ పనులు ముగిశాయి. ఎట్టకేలకు అంబేడ్కర్ నగర్‌లో కావేరి నీరు, డ్రైనేజీ వ్యవస్థ వ్యవస్థ కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు అనిల్‌రెడ్డి, రామచంద్ర, అంబేడ్కర్‌నగర్ వాసులు పాల్గొన్నారు.



నీటి విడుదలలో స్థానిక ప్రముఖులు

## 20 రోజుల్లో 12 జ్యోతిర్లింగాల దర్శనం

» బైక్‌పై ప్రయాణించిన ప్రవీణ్‌సింగ్



ప్రవీణ్ సింగ్

**బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):** బైక్‌పై ప్రయాణించి దేశవ్యాప్తంగా 12 జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ప్రవీణ్‌సింగ్ విజయవంతంగా పర్యటన పూర్తి చేశారు. ఈ సందర్భంగా బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైడ్ విత్ పర్పస్ అనే నినాదంతో ధార్మిక స్థలాలను సందర్శించానని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుని అపూర్వమైన అనుభూతికి లోనయ్యానన్నారు. ఒక్కో జ్యోతిర్లింగం అద్భుతమైన దైవశక్తిని కలిగి ఉందన్నారు. బైక్‌పై 20 రోజులపాటు 8,500 కిలోమీటర్లకుపైగా ప్రయాణించానన్నారు. ప్రారంభంలో బైక్‌పై ఈ సాహసం సాధ్యమేనా కొందరు ప్రశ్నించారని అయితే తగిన విశ్రాంతి తీసుకుంటూ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగానన్నారు. మైక్రోల్యాబ్స్‌లో మార్కెటింగ్ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న ప్రవీణ్ సింగ్‌కు తొలినుంచి బైక్ సాహసాలంటే ఎంతో ఇష్టం. వినోదాలకోసమే కాకుండా అడపాదడపా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను కూడా దర్శించుకోవాలని బైక్ ప్రయాణాలు చేసే సాహస ప్రియులకు సూచించారు. బైక్ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ప్రవీణ్‌సింగ్‌ను మైక్రోల్యాబ్స్ సంస్థ మానవవనరుల విభాగం ఉపాధ్యక్షుడు వీఆర్ రామకృష్ణ బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రవీణ్ సింగ్ ఈ అద్భుత సాహసయాత్ర యువతకు స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు.

## నేటి నుంచి గంధోత్సవం



మీడియాతో ట్రస్టు నిర్వాహకులు

**బంగారపేట, ఫిబ్రవరి 7:** పట్టణంలోని హజరత్ షంషుద్దీన్ ఔలి ట్రస్టు ఆధ్వర్యంలో 90వ వార్షిక గంధోత్సవం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు అధ్యక్షుడు షంషుద్దీన్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ ఖలీఫా మస్తాన్ సాహెబ్ ఖాద్రి, సజ్జాదిన్ హుసేన్, గద్దీన్ హుసేన్‌లు, ముఖ్యఅతిథిగా నగూర్ దర్గాకు చెందినవారు పాల్గొంటారన్నారు. 8న సందల్ షరీఫ్, 9, 10 తేదీలలో ఖవాలి కార్యక్రమం ఉంటుం దన్నారు. ఉరుసులో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్టు ఉపాధ్యక్షుడు గుల్జార్, కార్య దర్శి రెహమాన్, కోశాధికారి ఆదిల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఏడీజీపీకి సన్మానం



ఏడీజీపీ మువ్వా చంద్రశేఖర్‌కు సన్మానం

**మహదేవపుర, ఫిబ్రవరి 7:** స్థానిక కాడు బీసన హళ్ళిలోని న్యూహొరిజాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈనెల 11న జరగబోయే ఐటీ నిపుణుల సమావేశానికి విచ్చేయాలని ఏడీజీపీ (ఇంటర్నల్ సెక్యూరిటీ) మువ్వా చంద్రశేఖర్‌ను కాకతీయ కమ్మసేవా సమితి ఆహ్వానించింది. సమితి అధ్యక్షుడు సాదు దిలీప్, వ్యవస్థాపకుడు రామారావు గంగవరపులు బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ హోదాల్లో వ్యవహరించిన మువ్వా చంద్రశేఖర్‌కు ఇటీవల అదనపు డీజీపీగా పదోన్నతి లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆత్మీయంగా సత్కరించారు. ఇదే సందర్భంగా ఈనెల 11న ఏర్పాటయ్యే ఐటీ నిపుణుల సమావేశానికి విచ్చేయాలని ఆహ్వానించగా ఏడీజీపీ సానుకూలంగా స్పందించారని దిలీప్ తెలిపారు.

## చేళూరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**చేళూరు, ఫిబ్రవరి 7:** తాలూకా కేంద్రమైన చేళూరు పట్టణంలోని బాగేపల్లి మెయిన్ రోడ్డు, చింతామణి ప్రధాన రోడ్డుకు అనుబంధమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. తద్వారా నేరాల నియంత్రణ సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఒకవేళ నేరాలు, ఇతరత్రా చోటు చేసుకున్నా వాటిని ఛేదించడం సులభతరమవుతుందన్నారు. పోలీసు అధికారులు కూడా తాలూకా కేంద్రమైన చేళూరులో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చొరవ చూపాలని తద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ సులభతరం కానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.